పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి


131 బూత్‌ కమిటీ సభ్యులతో జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి తదితరులు

కుత్బులాపూర్‌: బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, బూత్‌ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్‌ ఎస్‌.మల్లారెడ్డి అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ 131 డివిజన్‌ బీజేపీ బూత్‌ కమిటీ అధ్యక్షులను నియమించారు. 473 బూత్‌ అధ్యక్షుడిగా శ్రీనివాసులు, 474 బూత్‌ అధ్యక్షుడిగా సాయిని సుధాకర్‌, 475 బూత్‌ అధ్యక్షుడిగా రాజేష్‌, 476 బూత్‌ అధ్యక్షుడిగా నర్సింహ, 451 బూత్‌ అధ్యక్షుడిగా గంజి శ్రీనివాస్‌, 449 బూత్‌ అధ్యక్షుడిగా అశోక్‌, 483 బూత్‌ అధ్యక్షుడిగా అశోక్‌, 484 బూత్‌ అధ్యక్షుడిగా హరికృష్ణ, 478, 495 బూత్‌ అధ్యక్షురాళ్లుగా దేవి, ధనలక్ష్మిలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్‌ల వారీగా ఇంటింటికీ తిరుగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. బీజేపీ యువమోర్చా అధికార ప్రతినిధి దయాకర్‌ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఫిలిం సెన్సార్‌ బోర్డు మెంబర్‌ నటరాజ్‌గౌడ్‌, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు కట్ట కుమార్‌, అసెంబ్లీ ఓబీసీ మోర్చా కన్వీనర్‌ శ్రీధర్‌ వర్మ, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు, డివిజన్‌ అధ్యక్షుడు రాజేశ్వర్‌ పాల్గొన్నారు.

మల్టీపర్పస్‌ ఫంక్షన్‌హాల్‌ నిర్మాణానికి కృషి


వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీలు

కుత్బుల్లాపూర్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. గాజులరామారం డివిజన్‌ పీపీనగర్‌లో ఉన్న ఉర్దూ షాదీఖానాను మల్టీపర్పస్‌ ఫంక్షన్‌ హాల్‌గా అభివృద్ధి చేయాలని కోరుతూ ఆదివారం సయ్యద్‌ రషీద్‌ ఆధ్వర్యంలో మైనార్టీలు వినతిపత్రం అందజేశారు. పీపీ నగర్‌లో 15వేల పైగా ముస్లిం కుటుంబాలు ఉన్నాయని, గతంలో కేటాయించిన 20 గుంటల ఖాళీ స్థలంలో మల్టీపర్పస్‌ ఫంక్షన్‌ హాల్‌ నిర్మిస్తే పేదలు శుభకార్యాలు నిర్వహించేందుకు ఉపయోగంగా ఉంటుందన్నారు. అనంతరం శ్రీశైలంగౌడ్‌ మాట్లాడుతూ.. మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి ఫంక్షన్‌ హాల్‌కు నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పీపీనగర్‌ ఉపాధ్యక్షుడు సయ్యద్‌ జహీరుద్దీన్‌, లాల్‌ మహ్మద్‌, హాసన్‌ ఖాన్‌, ప్రధాన కార్యదర్శి మిర్జా రషీద్‌ బేగ్‌, సంయుక్త కార్యదర్శి నుస్రత్‌, ఇబ్రహీం ఖాన్‌, సయ్యద్‌ సాదిక్‌ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను అరికట్టాలి


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్‌: బెల్టు షాపులను అరికట్టడంలో ఎక్సైజ్‌ అధికారులు విఫలమయ్యారని బీజేపీ నిజాంపేట్‌ అధ్యక్షుడు భిక్షపతియాదవ్‌ అన్నారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో నిజాంపేట్‌ పరిధిలోని వివిధ బస్తీలు, కాలనీల్లో నిర్వహిస్తున్న బెల్ట్‌ దుకాణాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్‌గృహకల్ప, ప్రశాంత్‌ నగర్‌, ఇందిరమ్మ కాలనీ, నిజాంపేట్‌ పాత గ్రామాల్లో నేటికి 6 బెల్టు దుకాణాలు కొనసాగుతున్నాయన్నారు. కిరాణా దుకాణాల్లో సైతం మద్యం లభిస్తోందని, ఎక్సైజ్‌ పోలీసులు అక్రమ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్‌ చేశారు. ప్రసాద్‌ రాజు, దాసి నాగరాజు, శ్రీనివాస్‌ గుప్తా, వెంకటేష్‌ ముదిరాజ్‌, నరసింహారెడ్డి, నరేష్‌ గుప్తా, కూన ప్రసాద్‌, విజయ్‌, ఉదయ్‌, త్రినాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

కథనానికి స్పందించిన 'పీసీబీ'

నిధుల లేమితో నిలిచిన చెత్త!



సాక్షి ఎఫెక్ట్‌..

నిజాంపేట్‌: బాచుపల్లి సర్వే నెంబరు 186లోని డంపింగ్‌ యార్డులోని వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో పరిసర కాలనీలు, బస్తీవాసులు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో ప్రచురితమైన 'నిధుల లేమితో నిలిచిన చెత్త' కథనానికి తెలంగాణ పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు అధికారులు స్పందించారు. ఈనెల 20న పీసీబీ టాస్క్‌ఫోర్స్‌ అధికారులు బాచుపల్లిలోని డంపింగ్‌యార్డును సందర్శించి శ్యాంపిళ్లను సేకరించారు. చెత్తను పెద్దమొత్తంలో డంప్‌ చేయడం, కాల్చడంతో హిల్‌కౌంటీ, బాచుపల్లి, బండారి లే అవుట్‌, ప్రగతినగర్‌ ప్రాంతాల ప్రజలు విషవాయువులతో ఉక్కిరిబిక్కిరవుతున్న విషయంపై గతంలోనూ ఈ మెయిల్స్‌, లిఖిత పూర్వకంగా పీసీబీకి ఫిర్యాదులు అందాయి. 2024 నవంబరు 28న పీసీబీ అధికారులు డంపింగ్‌ యార్డును సందర్శించారని, నిజాంపేట్‌ కార్పొరేషన్‌ అధికారులకు కొన్ని మార్గదర్శకాలను సూచించినా పాటించలేదని చీఫ్‌ జాయింట్‌ ఎన్విరాన్‌మెంట్‌ ఇంజినీర్‌ జారీచేసిన ఉత్తర్వుల్లో ప్రస్తావించారు.

- సాలిడ్‌ వెస్ట్‌ మేనేజ్‌మెంట్‌ రూల్స్‌ 2016ను చెత్త సేకరణ విషయంలో విస్మరించిందని, చెత్తను నిప్పు పెట్టిన సందర్భంలో మంటలు వ్యాపించకుండా ఫైర్‌ టెండర్‌ వెహికల్స్‌ను కార్పొరేషన్‌ అధికారులు వినియోగించడం లే దని, ఈ విషయాన్ని జనవరి 28, 2024లో డంపింగ్‌యార్డును సందర్శించిన టాస్క్‌ఫోర్స్‌ అధికారులు గుర్తించినట్లు పేర్కొన్నారు.
- వ్యర్థాలను జవహర్‌నగర్‌కు తరలించాలని ఆదేశించినా ఇంత వరకు వర్తింపజేయకపోవడంతో పరిసర ప్రాంతాల్లోని భూమి, నీరు, గాలి కలుషితమైందన్నారు.
- చెత్తను కాల్చడంతో ఈ(పీ) 1986 సెక్షన్‌ కింద అ. ధికారులను ప్రాసిక్యూషన్‌ చేసే అవకాశం ఉందని ఉత్తర్వుల్లో వివరించారు.
- డంపింగ్‌ నిర్వహణ, రక్షణ చర్యలపై ఇంత వరకు నిజాంపేట్‌ కార్పొరేషన్‌ అధికారులు వార్షిక నివేదికను సమర్పించకపోవడంపై జాయింట్‌ చీఫ్‌ ఎన్విరాన్‌మెంట్‌ ఇంజినీర్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు.
- బహిరంగ ప్రాంతాల్లో వ్యర్థాలకు నిప్పు పెట్టడంపై కార్పొరేషన్‌కు గతంలో పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు రూ.25 వేల జరిమానా విధించినా.. తీరులో మార్పు రాలేదన్నారు.
- సెక్షన్‌ 31 (ఏ) కింద ప్రివెన్షన్‌ ఆఫ్‌ కంట్రోల్‌ ఆఫ్‌ పొల్యూషన్‌ యాక్ట్‌ 1987 కింద నిజాంపేట్‌ కార్పొరేషన్‌ అధికారులను మెట్రోపాలిటన్‌ మెజిస్ట్రేట్‌ ఎదుట ప్రాసిక్యూషన్‌ చేసే అధికారం పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డుకు ఉందని, ఈ చట్టం కింద ఉత్తర్వులు ఉల్లంఘించిన అధికారులకు ఏడాదిన్నర నుంచి 5 ఏళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.

నీటి కొరతపై ఖాళీ బిందెలతో నిరసన



మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ గాయత్రినగర్‌లో సుమారు ఆరు నెలల నుంచి మంచినీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఆదివారం గాయత్రినగర్‌ గాంధీ విగ్రహం వద్ద సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెసరి సంజీవరెడ్డి మాట్లాడుతూ.. గాయత్రినగర్‌లో కొన్ని నెలల నుంచి మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. సమయపాలన లేకుండా జలమండలి అధికారులు అలసత్వం, క్రిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో సరఫరా చేయటం, లో ప్రెషర్‌తో తక్కువ సమయంలో నీటి సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఎప్పుడు మంచినీరు సరఫరా చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. లో ప్రెషర్‌ ఉన్న ప్రాంతాల్లో హై ప్రెషర్‌తో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. రోజు విడిచి రోజు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సంజీవ్‌, కోశాధికారి వెంకటరమణ, పి. శ్రీనివాసరావు, సూరిబాబు, కాశీనాథచారి, జితేంద్ర, ఉమా మహేష్‌, నాగేశ్వరరావు, గోపాల్‌ రెడ్డి, రాజు, సుబ్బారావు, దాసు, శ్రీనివాస్‌, నాయుడు, మహిళలు పాల్గొన్నారు.



వైకుంఠ ధామం

పూర్తయ్యేదెప్పుడో ?

- నాసిరకపు పనులు
- అధికారుల పర్యవేక్షణపై విమర్శలు

చింతల్‌: రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు ఖర్చుపెట్టి గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు చేస్తుంటే సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం దుర్వినియోగం అవుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైకుంఠథామాలు నాసిరకంగా నిర్మిస్తున్నారని, పనులు సైతం నత్తనడకన జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

గతేడాది శంకుస్థాపనకు ప్రణాళికలు..

చింతల్‌ డివిజన్‌ పరిధి చింతల్‌ సబ్‌స్టేషన్‌ పక్కన ఉన్న శ్మశానవాటికలో వైకుంఠథామం ఏర్పాటుకు గతేడాది రూ.కోటీ 6 లక్షలతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి శంకుస్థాపన చేశారు. నిధుల విడుదలలో జాప్యం జరగడంతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యం..

నిలిచిపోయిన పనులకు తోడు కాంట్రాక్టర్‌ సైతం నిర్లక్ష్యంగా పనులు కొనసాగిస్తున్నాడని, 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ' అన్న చందంగా మారిందని పలువురు వాపోతున్నారు.

నాణ్యత లోపాలు..

శ్మశానవాటిక నిర్మాణంలో నాణ్యత లోపంతో నిర్మిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షణ కరువై కాంట్రాక్టర్‌ నాసిరకంగా పనులు చేస్తున్నారన్నారు. నాసిరకమైన ఇసుక, మెటీరియల్‌ ఉపయోగిస్తుండటంతో నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నిలిచిపోయిన పనులు...

చింతల్‌ శ్మశానవాటిక నిర్మాణపనులు సగం మేర పూర్తిచేసి మధ్యలోనే వదిలేశారు. అధికారులు నిధులు విడుదల చేయకపోవడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ చేతులెత్తేశాడు. నిధులు విడుదల చేయాలంటూ స్థానికులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆరుబయటే స్నానాలు..

స్నానపు గదులు లేకపోవడంతో ఆరుబయటే స్నానాలు చేస్తుండటంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతిమ సంస్కారాలు చేసుకున్న ప్రతిసారి బయట నుంచి ట్రాక్టర్‌ ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి స్నానాలు చేయడంతో తీవ్ర అసౌకర్యంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

2022 ఆగస్టులో శంకుస్థాపన చేసిన ఈ వైకుంఠ ధామం పనులకు ఇప్పటి వరకు సుమారు రూ.45 లక్షల వరకు నిధులు విడుదలైనట్లు స్థానికులు చెబుతున్నారు. మిగిలిన నిధులు విడుదల కాకపోవడంతో వైకుంఠధామం అభివద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. స్థానికులు నిధుల విడుదలకు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్‌: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సికింద్రాబాద్‌ రైల్వే పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆలేరుకు చెందిన దూడల వెంకటేష్‌ (45) ఇరవై ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చి లాలాపేటలో నివసిస్తున్నాడు. డీటీపీ ఆపరేటర్‌ పని చేస్తున్న వెంకటేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఏడాది నుంచి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో 21వ తేదీ రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటేష్‌ లాలాపేట విజయ డెయిరీ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని రైల్వే పోలీసులు తెలిపారు.

క్రీడలకు తగిన ప్రోత్సాహం


బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్‌

కంటోన్మెంట్‌: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు తగిన ప్రోత్సాహం అందిస్తుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ అన్నారు. బొల్లారం బాల్‌ బ్యాడ్మింటన్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో కంటోన్మెంట్‌ పబ్లిక్‌ గార్డెన్‌ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అర్జుమన్‌రావు మెమోరియల్‌ ఒక రోజు బాల్‌ బ్యాడ్మింటన్‌ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శ్రీగణేష్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులతో కాసేపు ముచ్చటించి బాల్‌ బ్యాడ్మింటన్‌ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కూడా సొంతమవుతుందని అన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడల మీద ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. త్వరలోనే కంటోన్మెంట్‌ నియోజకవర్గం పరిధిలోని మడ్‌ఫోర్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక క్రీడా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. డిమాండ్‌ దృష్ట్యా మరిన్ని ప్రాంతాల్లోనూ మినీ స్టేడియాలను ఏర్పాటు చేస్తామన్నారు. బాల్‌ బ్యాడ్మింటన్‌ క్రీడను ప్రోత్సహించడానికి అవసరమైన సహాయం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలి


అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

కుత్బుల్లాపూర్‌: రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి రాజీనామా చేయాలని సీపీఎం కుత్బుల్లాపూర్‌ మండల కార్యదర్శి లక్ష్మణ్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో జీడిమెట్ల బస్‌ డిపో సమీపంలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితంగా ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు వామపక్ష పార్టీలు ఐక్యంగా పోరాడుతాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంజయ్య, సత్యం, సీఐటీయూ నాయకులు శ్రీను, తిమ్మప్ప, దుర్గానాయక్‌, మల్లారెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నూతన కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్‌: అభివృద్ధిలో కాలనీ సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. ఆదివారం అంబేడ్కర్‌నగర్‌ నూతన కమిటీ సభ్యులు పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్‌ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించి మాట్లాడారు. అంబేడ్కర్‌నగర్‌ అభివృద్ధికి గతంలో ఎన్నో నిధులు కేటాయించామని, కాలనీ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సారా శివకుమార్‌గౌడ్‌, ప్రధాన కార్యదర్శి కురుమ రాజేష్‌, సభ్యులు నరేష్‌, అన్వర్‌, నరసింహచారి, అంబారాజు, కిష్టయ్యగౌడ్‌, రాజు, నాగభూషణం పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కళాసిల్క్‌ చేనేత వస్త్ర ప్రదర్శన


ఎగ్జిబిషన్‌లో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మోతీనగర్‌: మోతీనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న కళాసిల్క్‌ చేనేత వస్త్ర ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తున్నదని నిర్వాహకులు, సొసైటీ ప్రతినిధి వికాస్‌ జైన్‌ తెలిపారు. ఈ మేళాలో పోచంపల్లి, మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, ధర్మవరం, చీరలు, కలంకారి చేనేత డ్రస్‌ మెటీరియల్‌, లక్నో చికెన్‌ వర్కు కుర్తీస్‌, వన్‌ గ్రామ్‌ గోల్డ్‌ ఆభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. యువతీ, యువకులకు నచ్చే విధంగా వస్త్ర ప్రదర్శనలో వివిధ వస్త్రాలు, వివిధ రకాల వస్తువులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. రాజస్థాన్‌ చీరలు, బెడ్‌షీట్‌లు, వివిధ రకాల బొమ్మలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 13 వరకు ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్‌ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఆమోదం లభిస్తేనే 'ఇల్లు'

- అర్హుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీ కీలకం
- ప్రజాపాలన దరఖాస్తులే ప్రామాణికంగా కొనసాగుతున్న సర్వే
- ఈ నెలాఖరులోగా పూర్తి చేసేందుకు చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: ఇందిరమ్మ ఇళ్ల అర్హులకు సంబంధించి ఇందిరమ్మ కమిటీలు కీలకంగా వ్యవహరించనున్నాయి. ఈ కమిటీ ఆమోద ముద్ర వేస్తేనే ఇళ్లు మంజూరు అవుతాయి. ఈ నేపథ్యంలోనే అర్హులైన ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌తో నగర శివారులోని మేడ్చల్‌–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో సంబంధిత సిబ్బంది సర్వే కార్యక్రమాన్ని చేపడుతోంది. పంచాయతీల్లో గ్రామ కార్యదర్శులు, మున్సిపాలిటీలు, పురపాలక సంఘాలలోని వార్డులు/డివిజన్లలో వార్డు ఆఫీసర్లు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాల్సి ఉంటోంది. మొదటి దశలో అత్యంత పేదలను గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని సర్కారు భావిస్తోంది.

ప్రజా పాలన దరఖాస్తులే ప్రామాణికం

కాంగ్రెస్‌ ప్రభుత్వం గతేడాది డిసెంబరు 26 నుంచి జనవరి 6 వరకు ప్రజల నుంచి ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరించింది. ఈ దరఖాస్తుల ఆధారంగానే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసుకున్నారు. దరఖాస్తుల వివరాలను అధికారులు ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పురపాలక సంఘాల్లో ఇల్లు లేని వారి వివరాలు వార్డులు/డివిజన్ల వారీగా కనిపిస్తాయి. వీటి ఆధారంగా సర్వే బృందాలు క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నారు. ఇల్లు లేని వ్యక్తుల పూర్తి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటోంది.

ఇందిరమ్మ కమిటీ కీలకం

ఇళ్ల సర్వే అనంతరం వెల్లడైన జాబితాను ఆయా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పురపాలక సంఘాల్లోని వార్డులు/డివిజన్ల పరిధిలోని ఇందిరమ్మ కమిటీలకు అందజేస్తారు. కమిటీ సభ్యులు జాబితాలో ఉన్న వారి పేర్లను పరిశీలించి వారు అర్హులా? కాదా? అని నిర్ణయిస్తారు. కమిటీ ఆమోదించిన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తారు. ఇందులో సొంత స్థలం ఉండి అసలే ఇళ్లులేని పేదలకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. స్థలాలు లేని వారికి ప్రభుత్వం స్థలాలు కొనుగోలు చేసిన తర్వాత మరోసారి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు వివిధ దశల్లో అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్‌: విద్యుత్‌ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో సోమవారం విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సెక్షన్‌ ఏఈ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.11కేవీ కొంపల్లి ఫీడర్‌ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొంపల్లి గ్రామం, సెంట్రల్‌ పార్క్‌, జయభేరి పార్కు, ఆంధ్రబస్తీ, తెలుగు బస్తీ, సురేఖ ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

జీడిమెట్ల: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా సోమవారం అపురూప కాలనీలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలను తొలగింపు, ఇతర మరమ్మతుల కారణంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


మేయర్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

నిజాంపేట్‌: కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని నిజాంపేట్‌ మేయర్‌ కొలను నీలా గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రగతినగర్‌లోని 4వ డివిజన్‌ కాలనీ వాసులు మేయర్‌ను కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సురేంద్రకుమార్‌, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

బాంబే సర్కస్‌ ప్రారంభం


సర్కస్‌ను ప్రారంభిస్తున్న గౌరీష్‌ తదితరులు

కుత్బుల్లాపూర్‌: కుత్బుల్లాపూర్‌ మున్సిపల్‌ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన గ్రేట్‌ బాంబే సర్కస్‌ను ఆదివారం మాజీ కార్పొరేటర్‌ కె.ఎం.గౌరీష్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేట్‌ బాంబే సర్కస్‌ యాజమాన్యం ప్రజల ఆదరాభిమానాలను చూరగొనేలా షోలు నిర్వహించాలన్నారు. సర్కస్‌లో చైనా, రష్యా దేశాలకు చెందిన కళాకారుల విన్యాసాలు, ఫీట్లతో ఆకట్టుకోనున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్‌ నగర్‌ ప్రెసిడెంట్‌ దిలీప్‌గౌడ్‌, రాజు, రవిగౌడ్‌, రవి, రాము, సర్కస్‌ యాజమాన్యం పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జీడిమెట్ల పీఎస్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాయుడు వివరాల ప్రకారం.. గాజుల రామారం శ్రీవేన్‌ ఎన్‌క్లేవ్‌లో నివాసముండే చంద్రకాంత్‌(50) కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ఎప్పటిలాగే శనివారం రాత్రి భోజనం చేసిన అనంతరం కుటుంబ సభ్యులు నిద్రకు ఉపక్రమించారు. ఆదివారం తెల్లవారు జామున చంద్రకాంత్‌ కుమారుడు సూరజ్‌ నిద్రలేచి చూడగా చంద్రకాంత్‌ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ ఉన్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారం ఇప్పిస్తా

ఆ తర్వాతే ప్రాజెక్టు పనులు చేపడతామని ఎమ్మెల్యే హామీ

కంటోన్మెంట్‌: ఎలివేటెడ్‌ కారిడార్‌ కోసం చేపట్టే విస్తరణలో భాగంగా నివాసాలు కోల్పోయే వారికి ప్రభుత్వం తగిన పరిహారం అందజేస్తుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ అన్నారు. జాతీయ రహదారి –44 మార్గంలో రోడ్డు విస్తరణ కారణంగా ఇళ్లు కోల్పోయే వారిని ఆదుకోవాలంటూ చిన్న తోకట్ట , బోయిన్‌పల్లి ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ తరఫున ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండ్లు కోల్పోతున్న వారికి ఎట్టి పరిస్థితులలోనూ నష్టం కలుగకుండా తాను స్వయంగా ముఖ్యమంత్రితో మాట్లాడి తగిన నష్టపరిహారం ఇప్పించే బాధ్యత తీసుకుంటానని బాధితులకు భరోసా ఇచ్చారు. ఇండ్లు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయంగా మరోచోట ఇండ్లు కూడా కట్టించి ఇచ్చే ప్రయత్నం చేస్తామని చెప్పారు. కలెక్టర్‌తో సహా ప్రభుత్వ అధికారులు అందరూ వచ్చి మాట్లాడి బాధితులకు న్యాయం జరిగిన తరువాతనే ప్రాజెక్ట్‌ ముందుకు వెళుతుందని, ఈలోగా ఎవరైనా తప్పుడు సమాచారం ఇస్తే నమ్మి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. 1970లో అప్పటి కాంగ్రెస్‌ నాయకులు సంజీవయ్య చొరవతో తమకు ఈ ఇండ్లు వచ్చాయని అప్పటి నుంచి మూడు తరాలుగా తాము ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నామని బాధితులు ఎమ్మెల్యేకు వివరించారు. ఇప్పుడు ఎలివేటెడ్‌ కారిడార్‌ వలన తమ ఇండ్లు పోతున్నాయని, తమను వేరే ప్రాంతానికి తరలిస్తే తీవ్రంగా నష్టపోతామని వాపోయారు.